

# నాన్న ఫోటో

**మ**ంచి మనసుకి ప్రతిబింబం, మానవతకి ప్రతినిధి నాన్న. నెగళ్ళు వెలిగే క్రౌర్యానికి బద్ధ విరోధాయన.

మా పల్లె అనేకాదు, చుట్టుపక్కలున్న పల్లెలన్నింటికీ నాన్నంటే అపారమైన గౌరవం, అభిమానమూను.

ఎక్కడెక్కడో కొండకోనలన్నింటినీ గాలించి, మూలికలు సేకరించి, వాటిని ఔషధాలుగా మలచి ప్రజలను ఆరోగ్యవంతులుగా చేసిన ఘనుడాయన. రోగులిచ్చిందే పుచ్చుకుని ఇంత కుటుంబాన్నీ నెట్టుకొచ్చారంటే నాకిప్పటికీ ఎనలేని ఆశ్చర్యమే!

చెప్పి వచ్చేవికాని అవసరాలు ఆయన ఆదాయాన్ని నిలదీసి ప్రశ్నించినా, చిరు నగవుతో, ఓరిమితో వెనుకాడకుండా అందరి చదువులూ, పెళ్ళిళ్ళూ పురుళ్ళూ, పుణ్యాలూ అన్నీ ఒకటొకటే గడుపుకొచ్చారు. అత్యవసరమైన సందర్భాల్లో కోసుళ్ళకొద్దీ దూరాలు నడవటం, ఏ అపరాత్రికో ఇల్లు చేరటం, ఎంగిలి పడకుండా నిద్రపోవటం కూడా ఆయనకు పరిపాటే.

శోభించే వ్యక్తిత్వం, అలరించే ఆప్యాయతలకు కొలువైన నాన్నను అందరూ కీర్తిస్తుంటే, నాన్న హయాం ఎంత గొప్పదో అవగాహన చేసుకోగలిగాను.

నా కంటే వాళ్ళంతా ఆయన చేరువలో సన్నిహితంగా మెలిగి ఒడిచేరిన వాళ్ళే.

నేను ఆ చిన్నపాటి తృప్తిని కూడా పొందలేకపోయానేమో!

ప్చ్... అంతా పసితనం! నాన్న సాన్నిహిత్యం నన్ను వెంటాడేది.

ఆయనకు బరువు బాధ్యతలు, ఇబ్బందులు ఉచ్చులా తగిలి ఊపిరి సలపనివ్వకపోవచ్చుగాక! కానీ అవేవీ గ్రహించని నా పసితనం నాన్న ఆప్యాయతనే కాంక్షించేది. అదీ సరిగ్గా ఈలోకానికి వీడ్కోలు పలికే చివరిక్షణాల అంచుల్లో...

మరణశయ్యపైనున్న నాన్న కాయం పరిసరాలను పరికించే స్థితికి దూరమైనప్పుడు మాత్రం నాకెందుకో కరవుదీరా నాన్నను కౌగిలించుకోవాలనిపించింది. మునివేళ్ళతో ఆయన ఛాతి మీద నిమురుతూ నేను కళ్ళంట నీళ్ళు కారుస్తుంటే, అమ్మ కళ్ళల్లోంచి జాలువారిన కన్నీళ్ళు నాకు తోడయినాయి.

ఎవరికి వారే వాస్తవాలను మరచి డబ్బు దొంతరలకు వంత పాడే వ్యాపకాల ఊబిలో చిక్కుకుని ఊపిరి సలపకున్నారట!

నేనూ, అమ్మే మిగిలాం. నాన్న గుండె హైరానా పడి పడి సడిలేనిదయింది. బావురుమన్న క్షోభిత హృదయరావాలకు ప్రతిధ్వనుల్లా ఫోన్ మెసేజ్‌లు నాన్న కన్న గంపెడు సంతానానికి చేరాయి.

ఎంత దురితులైనా అనుబంధానికి సాక్షీభూతమైన కన్నీటి వరదకి అతీతులు కారు!

పునశ్చరణ తరగతుల్లా తలో రీతిన ఆయనతో తమకున్న అనుభవాలను పునరావృతం చేసుకున్నారు. వెళ్ళేముందు వాళ్ళ దృక్కోణంలో పడని వస్తువు అమ్మ ఒక్కటే! తతిమ్మావన్నీ ఈడ్చుకెళ్ళారు. నయం... కొంప జోలికి పోలేదు. అందులోనే అమ్మా, నేనూ పడి ఉన్నాం...

నాన్న పండించిన ధనరాశులేమంటే ప్రజల అభిమాన ధనరాశులే! అదే మా పాలిట శ్రీరామరక్ష!

ఎందుకో నాన్న రూపాన్ని ప్రతిక్షణం గుర్తుకు తెచ్చుకోవాలనిపించేది. కానీ.. ఆ ఆకృతిని కళ్ల ముందుకు తేవటానికి అతి ప్రయాసకు, ఒత్తిడికి లోనవాల్సి వచ్చేది. అప్పుడే నాన్న ఫోటో చూడాలనిపించింది. అమ్మనడిగానామాటే.

"అదే మన దురదృష్టంరా! ఆయనకు ఫోటోలు, ఆర్భాటాలు ఇష్టం ఉండేవికాదు... నాగుండె గదిలో నిక్షిప్తమైన రూపమే గుర్తుగా మిగిలింది" విచారంగా అందామె!!

హతాశుడనయ్యాను.

అంటే క్రమక్రమంగా నా కనుపాపల్లోంచి, మనసు పొరల్లోంచి ఆ రూపం మరుగయ్యే అవకాశాలే ఎక్కువ.... భరింపరాని ఆ ఊహకు తల్లడిల్లిపోయాను.

నా ప్రార్థన విన్నాడేమో... కనిపించని ఆ దేవుడు మునసబుగారి పాలేరు రూపంలో ఎదురైనాడు.

ఓసారి వాడు మా ఇంటికొచ్చి నాన్నతో తన అనుబంధం, సాహచర్యం అన్నీ ఒకటొకటే విప్పిచెబుతూ వెళ్ళిపోతున్నవాడే కమీజు లోంచి ఓ చిన్న పర్సులోంచి తీశాడది.

అరె! నాన్న ఫోటో!!

అణువణువూ ఆశ్చర్యం నెలకొని ఆనందబాష్పాల పర్యంతమైంది. ఎప్పుడో ఒకాయన నాన్న ఫోటో తీసి ఆయనకిస్తుంటే వద్దన్నారుట - అప్పుడాయన దగ్గర్నుంచి తను అందుకుని దాచుకున్నాడట.

ఆ పది క్షణాలు ఎంత ఆరాటంగా తిలకించానో నాకే తెలీదు. అనూహ్యమైన గగుర్పాటు!!!

ఎలాగైనా ఆ ఫోటో నాకిమ్మన్నాను. కానీ దాన్ని తన దగ్గర అట్టే పెట్టుకోవటానికే ఇష్టపడ్తున్నట్లుగా కాస్త నసిగాడు. కొంచెం ఒత్తిడి చేశాక చేతిలో పెట్టాడు.

ఆ ఫోటో చూశాక అమ్మ - అనంతానందాంబుధిలో ఓలలాడింది. స్టూడియో కిచ్చి కొద్దిగా పెద్దది చేయించాను. దాన్ని తిరిగి కార్డుబోర్డుపై వేయమని పెయింటర్‌కి ఇచ్చాను. చేయి తిరిగిన ఆ చిత్రకారుడి కుంచె ప్రాణం పోసుకున్న నాన్నను మా కళ్ళకు చూపించింది.

"ఎంత మంచి పనిచేశావురా!" అమ్మ మెచ్చుకోని క్షణం లేదు. హాల్లోకి ఎవరొచ్చినా ఎదురుపడేది నాన్న చిత్రమే. సుమారు నాలుగడుగుల ఎత్తు... మంచి ఫ్రేముతో ముచ్చటగొలిపేది.

ఓసారి అక్కలు, అన్నలు కట్టకట్టుకునని వచ్చారు. "నాన్నగారిదెలా ఉందో ఫోటో..." అంది పెద్దక్క

"అదేనూ... మన తమ్ముులుంగారికి ఆయన మీద మహా మక్కువ ఎక్కువైపోయి.. 'ఇంత' చేయించిపెట్టాడు" అని చేతులూపింది చిన్నక్క.

వాళ్ళు ఓ పథకం ప్రకారం ఊడిపడ్డారు... ఉన్న ఆ ఒక్క ఇల్లూ అమ్మేసి నాన్నగారు తయారుచేసిన విలువైన భస్మాలు, ఔషధాలు ఏ ఫార్మసీవారికో అమ్మేసి, మా

ఇద్దరినీ వాళ్ళతో పాటు టౌనుకు లాక్కెళ్ళి ఆ అద్దె కొంపల్లో పడేయాలని పన్నాగం... కానీ ఊరిపెద్దల తగవుతో అది పారలేదు.

అంతే.... మా పొడగిట్టనట్లుగా ఒక్క క్షణం నిలవలేదు వాళ్ళు. అది మొదలు ఎడమొహం పెడమొహంగా వ్యవహరించసాగారు. అమ్మ ఆప్యాయతల చలువ పందిరి కిందనే నా ఆశ్రయం.

రోజులు క్షణాలైనాయి. నా పెళ్ళికి రాకతప్పదన్నట్లుగానే వచ్చారు. అమ్మ వేసిన అక్షింతలే నాకాశీర్వచనాలు.

అమ్మలాగా కూరిమి, ఓరిమిగలామె నా భార్య ప్రతిమ. నాన్న ఆశీర్వాద బలం అదృశ్యశక్తిలా నన్ను వరించిందే మోకానీ మళ్ళీ ఇంటి వైద్యానికి పూర్వ వైభవం వచ్చింది.

పరిస్థితులు మార్పుకి తలొంచుతాయేమో! దురదృష్టం వెన్నాడింది. హఠాత్తుగా గుండెపోటుతో అమ్మ మరణం. తట్టుకోలేకపోయాను. తోబుట్టువులొచ్చారు. కార్యక్రమాలు నెరపటానికి డబ్బు లంకెతో నాన్న ప్రయత్నించినా, ఊరివాళ్ళ అండదండలతో అమ్మకు సైతం ఘననివాళే లభ్యమైంది...

ఆ లంకంత కొంపలో నేనూ, మా ఆవిడే ! క్షణం క్షణం అమ్మ జ్ఞాపకాలు.. నాన్న ఫోటో చూసినప్పుడల్లా మాకు గుండె ధైర్యం కలిగేది.

ఎందుకో రానురాను సూదిపోటుగాళ్ళ సుడిగాలికి, మా గృహవైద్యం బిక్కమొహం వేసింది.

కాలప్రభంజనంలో తరం మార్పు అనివార్యమైంది. ఇంటందరిలో చిన్నాడిగా నిలిచిన నాకు ఇద్దరు పిల్లలు, వాళ్ళు చదువులదాకా రావటాలు అంటే ఆశ్చర్యమే! దాంతోపాటే భయం నెలకొంది నాలో. ఈనాటి హైటెక్ యుగంలో, చదువుల పరుగుపందెంలో పిల్లలు నెగ్గుకు రాగలరాన్న సందేహం, ఉద్విగ్నం నన్ను నిలువునా ముంచెత్తాయి.

ఆ అనుమానమే నన్ను పట్నవాసితుణ్ణి చేసింది. పల్లెను మేం వదలినా, మాతోపాటే నాన్న ఫోటో కూడా తోడుండేది.

నాన్న ఆశీర్వదం మా పిల్లలపై సైతం ప్రసరించింది కాబోలు ఇద్దరు మగపిల్లలూ ప్రయోజకులైనారు. మంచి ఉద్యోగాల్లో నిలదొక్కుకున్నారు. పిల్లల మదిలో కూడా మా నాన్న పట్ల గౌరవభావం పదిలంగా ఉండాలని పదే పదే ఆయన గురించి చెబుతుండేవాణ్ణి...

అందరం కలిసే ఉన్నాం... ఉద్యోగ రీత్యా మొదటివాడు తరుణ్‌తో మేముండక తప్పలేదు. రెండోవాడు విశాల్ ముంబాయిలో ఉన్నాడు. తరుణ్‌కి పెళ్ళి. ఈ మిషతోనయినా నా అన్నలూ, అక్కలూ వస్తారని, వాళ్ళు ఆశీర్వదిస్తే నాకు కొండంత తృప్తిగా అనిపిస్తుందని ఆశించాను. కానీ ఎవరి జాడా లేదు. నా మీద ఎందుకు ద్వేషమో అర్థం కాలేదు... వారందరికంటే గొప్పవైన అమ్మనాన్నల దీవెనలుంటే చాలునని తృప్తిపడ్డాను.

అయితే కొద్దిరోజుల్లోనే తరుణ్ స్వభావంలో మార్పు గమనించాను. "ఎంతసేపూ ఆ ఫోటోకి కొలువు చేయకపోతే బజారుకెళ్ళి కూరగాయలు తేరాదూ?" అన్నాడోసారి.

అయినా నేనావేశపడలేదు. చెప్పిన పని చేసేవాణ్ణి.

"ఏమండీ... తరుణ్‌లో మార్పుకి కారణం నాకర్థం అయిందండీ... ఉదయం కోడలు పూజ చేసినపుడు మామగారి ఫోటోకి కూడా హారతి ఇవ్వమ్మా అంటే. ఏం చేసిందో తెలుసా?... ఆ చెక్కబొమ్మకి కూడా పూజలట!?.. అని ఎద్దేవా చేసింది...!!" అని ప్రతిమ నన్ను చుట్టుకుని ఏడ్చేసింది.

అప్పుడు కూడా నేను ఉదాసీనుణ్ణే. కాని ఆ రోజు... ఆరోజు...

నాన్న ఫోటోని అమాంతం ఎత్తి అటకమీదికెక్కిస్తూ తరుణ్, భార్యదీప్తి... ఒక్కసారిగా అరిచాను.

"ఏం కొంపలంటుకుపోయాయని అలా అరిచారు..." స్టూలు దిగి తగువాడాడు తరుణ్.

"తెల్లారిలేస్తే కళ్ళకెదురుగా కనిపించే దేవుడ్రా ఆయన. నీకేం అపకారం చేసిందటది... దాన్ని అటకెక్కిస్తున్నావు.."

తరుణ్ ఏనాడూ అలా మాట్లాడలేదు. "కాకపోతే... ఆ చెక్కబొమ్మను తన్నుకుని మీ కోడలి కాలు ఎలా వాచిపోయిందో చూడండి..."

"చూసుకోకుండా నడవటం ఎవరి తప్పు...? అందుకని నాన్న ఫోటోని మా కళ్ళెదురుగా లేకుండా మూలపడేస్తావా...? దాన్ని మీదకెక్కించి చెదలు పట్టించొద్దు.." అని వాళ్ల ప్రయత్నాన్ని వారించాను.

"మీకంత భద్రంగా దాచుకోవాలనిపిస్తే ఆ పల్లెలో వదిలిపెట్టి రండి. ఈ పట్నపుటిళ్లలో అంత జాగాలేం ఉండవు..." అనేసి చరచర తన గదిలోకి వెళ్ళిపోయాడు తరుణ్.

ఒక్కసారి ప్రాస్పడిపోయాం.

కొడుకు, కోడలు ఎటో వెళ్ళి గంటలో తిరిగి వచ్చారు.

"ఇదిగో చూడండి! మీ ఆ చెక్కబొమ్మ వల్ల వదిలిన బిల్లు.. ఎక్సరేలకీ, మందులకీ కలిపి. హుఁ... ఇప్పటికైనా అర్థమైందా" అనేసి చేతులు జోడించాడు.

ఖిన్నుడనైనాను.

నేను పల్లెకు పోదామన్నాను.

"ఈ ఫోటో కారణంగా మనం అలిగి వెళ్ళిపోయామనుకోండి... కొడుకు, కోడలు తరిమేశారనో, లేక వారితో ఇమడలేక మనం వచ్చేశామనో లోకం నిందలేస్తుంది. మనం నేర్పుగా బతకాలి. అంతే..." అంది ప్రతిమ ఓర్పు వహించమని కోరుతూ...

ఈ చిన్న విషయాన్ని పెంచటం నాకూ ఇష్టంలేదు... కానీ ఉదయం నేను లేచేసరికి ఉండవలసిన చోట నాన్న ఫోటో లేదు. లేవగానే ఆయన ఫోటో చూసితృప్తి పడ్డం నాకలవాటు... అంతటా వెతికాను.. అడుగుదామంటే తలుపులు బిడాయించుకుని ఉన్నారింకా...

నేను చెప్పినా వినకుండా అటకెక్కించేశారేమోనన్న సందేహం తొలిచేసింది.

తరుణ్ బయటపడేదాకా ఉత్కంఠే!

కళ్ళు నులుముకుంటూ వస్తుంటే అడిగాను.

"ఉదయాన్నే ఎందుకంత గొడవ... బయట వరండాలో చేరేశా..." అతి నిర్లిప్తంగా అన్నాడు.

వరండాలో వారగా చేరబెట్టి ఉంది. ఆర్తిగా తడిమాను. తెగ కోపం వచ్చేసింది. అంతే మళ్ళీ ఫోటో పట్టుకుని లోపలికి నడిచాను.

నన్ను చూస్తునే వెర్రెత్తిపోయాడు తరుణ్.

"అసలు మీకేంటా మొండితనం.. బతికున్న మనుషులకే జాగాలు లేక చస్తుంటే, చచ్చి పైలోకాల్లో ఉన్న శాల్తీల ఫోటోలకు ఇక్కడ చోటెక్కడిది? ఛ ఛ.. అర్థం చేసుకోరు. బయటే పెట్టండి.." హుకుం జారీ చేశాడు తరుణ్.

ప్రతిమ కళ్లతో వారించింది. నా ఆవేశం చప్పున చల్లారింది.

తరుణ్, దీప్తి ఏదో గొప్ప విజయం సాధించినట్లుగా భావించారు. అది చూసి నా శిరస్సు అవనతం అయింది.

ప్రతిమ కళ్లలోకి చూశానోసారి...

"ప్రతిమా! వీళ్ల అభివృద్ధి కోసం, భవిష్యత్తును హరివిల్లులా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఆ పల్లెటూరు విడిచి, ఈ పట్నం వచ్చి, పద్దులురాసి మరీ చదివించాను. కానీ ఈ రోజు వీళ్ళకి నా మాట ఖాతరు లేకుండా పోయింది. పైగా నానా రాద్ధాంతం చేశాడు" అని చిన్న పిల్లడిలాగే కన్నీళ్ళు పెట్టుకున్నాను.

"చిన్నప్పుడు చదువులకెళ్ళిన ప్రతీసారి తాతగారి ఫోటోకి దణ్ణం పెట్టేవారు. మరీరోజు ఏమైందండీ వీళ్ళకి..." తనూ రోదించింది ప్రతిమ.

ఇద్దరం కొడిగట్టిన దీపాల్లా బిక్కుబిక్కుమని గడిపాం.

ఉదయంలేచి వరండాలోకి వెళ్ళాను. గుండె గుభేల్మంది. నాన్న ఫోటో పడదోసి ఉంది. తిరిగి నిలబెట్టాను. ఎప్పటిలా నిటారుగా లేదు. ఓ వైపు ఫ్రేం బద్దలయి కుంటిదానిలా ఎగుడుదిగుడుగా తయారైంది.

నా ఆగ్రహానికి తావులేదు...'ఎవడు చేసాడీ వెధవపని" భీకరంగానే ఉంది నా కంఠం.

అది విని పక్కవాటా వాడు నా మీదకి జట్టీకి దిగాడు. తమ సైకిల్ పెట్టుకునే జాగాలో ఫోటో అడ్డంగా ఎందుకు పెట్టారని వాదించాడు. ఫోటో విరిగేలా ఎందుకు పడదోయాలని నా వాదన...

అప్పుడే గదిలోంచి బయటపడ్డ తరుణ్ వెర్రికోపంతో....

'నాన్నా! నా పరువు తీయడానికి కంకణం కట్టుకున్నారా? జీవంలేని బొమ్మని పట్టుకుని ఎందుకలా గింజుకుపోతున్నారు. ఆయన మీకు దేవుడే కావచ్చు. కానీ మాకిప్పుడు కంపలా తయారైనాడు. మీకంతగా అదే ముఖ్యమనుకుంటే కొంతకాలం తమ్ముడి దగ్గరకు పట్టుకువెళ్ళండి.. వాడికీ తెలుస్తుంది. ఎలాగూ పెళ్ళీ పెటాకుల్లేవు కూడాను..." కరుగ్గానే చెప్పాడు తరుణ్.

నా అంతరంగసీమలో వాడి పట్ల తిష్టవేసిన పటిష్ఠభావాలొక్క సారి అదృశ్యమైనాయి.

అనుబంధానికి అపూర్వ నిర్వచనం ఇవ్వవలసిన తరుణంలో పెడర్థాలకు స్థానం ఇవ్వలసిన ప్రారబ్ధం కల్గటం దురదృష్టం...

మూడు రోజుల తరవాత విశాల్ దిగాడు.

అన్నదమ్ములిద్దరి నడుమ వాదోపవాదాలు జరిగాయి... "నేను పెళ్ళీపెటాకుల్లేకుండా ఫ్రీగా గడిపేస్తున్నానని నీకు జెలసీ.. నేనా ముంబాయి

మహానగరంలో ఏ కులాసాలు చేస్తున్నానోనని నీకు కుళ్ళు... పోనీలే నాకూ తల్లితండ్రుల పూచీ ఉందిగా... ఏం మనల్ని కష్టపడి చదివించి ఇంత వాళ్లని చేయలేదూ!!"

విశాల్ మాటలు వింటుంటే నా మనసు ఉల్లాసంగా గడిపిన క్షణాలు ఎంతో ఉన్నతమైనవి. వాడి రాక మమ్మల్ని తనతో తీసుకెళ్లాలన్న ఉద్దేశ్యాన్ని కనబరిచాడు.

మర్నాడు ఉదయమే ప్రయాణం. ఆటో తెచ్చాడు.

'ఇంకా ఏమిటి ఆలస్యం నాన్నా!? పదండి" తొందరచేశాడు విశాల్.

"ఉండ్రా!" అంటూ వరండాలోని ఫోటోను పట్టుకుని బయటకొచ్చాను.

'ఇదేమిటి నాన్నా..." తెల్లబోయాడు

"తాతగారి ఫోటోరా!"

"బాగుంది వరస.. ఆ ముంబాయిలో నేనున్నదే చిన్న పార్టిషన్‌లో అదీ దొరక్క దొరక్క దొరికింది... ఇదో లంపటమా! ఇక్కడ అటకమీద పడేసి నాతో రండి.." అని చిర్రుబుర్రులాడాడు.

"అది కాదురా.. మీనాన్న మీతో ఉండాలని మీకెలాగుంటుందో మా నాన్న ఫోటో నా వెంట ఉండాలని కోరుకవటంలో తప్పులేదు కదా!"

"మీ చాదస్తం మహ బాగుందిలెండి... ఇలాటి సెంటిమెంట్లు పెట్టుకుంటే ఈ హైటెక్ యుగంలో బతకలేరు... ఆపై మీ ఇష్టం.. నాతో రావాలంటే ఈ ఫోటో వదిలిపెట్టాల్సిందే..."

ఆ షరతుకి అంతెత్తున లేచాను.

"ఏంరా బ్రదర్! నీకిప్పటికయినా బోధపడిందా...? నీ సుఖాలు చూసి కుళ్ళిపోతున్నానని నిందించావు... చూశావుగా ఇదే వైఖరి" అని నిలదీశాడు తరుణ్. వంత పాడింది దీప్తి !

ఆ ఫోటోని అటకెక్కించి చెదలపాలు చేయటమా?

వారికి ప్రతిబంధకమైనది, తనకు అనుబంధమైనది నాన్న ఫోటో!!

"సరే లెండి.. నిందలు నిష్ఠూరాలు పడుతూ ఇక్కడే పడి ఉండండి... సుఖపడే యోగం మీ నుదుట రాసుండకపోతే నేనేం చేసేది" ధుమధుమలాడుతూ వెళ్ళిపోయాడు విశాల్.

నా మనసు స్పందన శూన్యమైనదయింది. ఏం చేయాలో కంటే ఏం చేయకూడదో అర్థం కాలేదు. లోపలకి ఫోటోతో వెళ్తే తరుణ్ ప్రతిఘటన ఎలా

ఉంటుందో... బయట ఉంచితే పక్క వాటావాడు ఏం రభస చేస్తాడో... డోలాయమాన స్థితి. కానీ కొద్ది క్షణాలలో మేమో నిర్ణయానికి వచ్చాం. లోపలకి వెళ్ళి బట్టలు సర్దుకున్నాం.

"పెద్దవాళ్ళు ఉన్నపళంగా మీరు బయటకెళితే నేనే గెంటేశానని లోకం కోడైకూస్తుంది..." అన్నాడు తరుణ్.

"బుర్ర పండిన వాళ్ళకే ఇంత పట్టుదలలుంటే, మనకెంత పౌరుషం ఉండాలని.. పదేపదే బతిమిలాడకండి.. ఆ చెక్కబొమ్మను నెత్తినెట్టుకుని ఊరేగమనండి"

దీప్తి మాటలకు అంతెత్తున కోపం లేచింది. అంతే మరొక్క నిమిషం ఉండడానికి ఇష్టపడలేదు...

ఒక్కసారి బయటకు రాగానే, స్వేచ్ఛా గాలులు పీల్చినంత సంబరం కలిగింది... మా ఊరి బస్సు ఎక్కేందుకు బస్టాండుకి వెళ్ళాం. ఎందరెందరో... మాఊరు వెళ్ళే జనం.. ఎప్పుడో చూసిన మొహాల్లో మార్పులు కొట్టొచ్చినట్లుగా...

మమ్మల్ని పోల్చిన కొందరు సమీపంగా వచ్చారు.. అది ఆప్యాయతను రంగరించుకున్న పలకరింపుల మేళాలా ఉంది.

"బాబూ! ఇంతకాలమిమ్మల్లేక ఇల్లెంత బోసి పోయిందో... గుమ్మంలో కెడితే చాలు... ఈ బాబు బొమ్మ మా కంటికి దేవుళ్లాగగపడేది... మీరు పోడవేటి అరిట్టంలాగయింది. ఎదవ సూదిపోటుగాళ్ళ వల్ల మరిన్ని రోగాలు సుట్టుముట్టాయి" అని చెక్క బెంచీకి చేరబెట్టిన నాన్న ఫోటోని తృప్తిగా కళ్ళకద్దుకుని దణ్ణం పెట్టుకున్నాడు ఒకడు.

మా బస్సొచ్చింది. ఎక్కాం... ఎగిరే పక్షుల సంతృప్తి మాలో నెలకొన్నది..

మా పల్లె ప్రజలందరి ఉచ్ఛ్వాసనిశ్వాసాల నడుమ మేము... చాలాకాలం తదుపరి... మేం మా ఇంట్లో అడుగుపెట్టిన అద్భుత... పవిత్ర క్షణం..

నాన్న ఫోటో ఎప్పటిలా యథా స్థానంలో... మాగుండెల్లో ఏ అలజడికీ తావులేని ప్రశాంతత... నాన్న ఫోటో నాకు తోడునీడగా నిలిచి అనుక్షణం ఆశీర్వదిస్తున్నట్లుగా ఉంటుందనే నేను, నా కొడుకులతో పోరాడి ఆయన అస్తిత్వానికి ఏమాత్రం భంగం కల్గించకుండా కాపాడుకొచ్చాను.

పిల్లలకోసం పల్లెను విడిచి పట్నం చేరిన నాకు, నాన్నే గుణపాఠమైనట్లు చేసి, తనే ఓ అడుగుజాడగా మారి ఈ పల్లె చేర్చారనిపించింది. పల్లె ప్రజలందరూ కలసి మూడు నెలల్లో నాన్న శిలా విగ్రహం ప్రతిష్ఠ జరిపారు. ఆయనపై అభిమానాన్ని

వారావిధంగా చాటుకున్నారు అంతేకాదు, నెలవారీ మాక్కావలసిన దినుసులన్నీ అందించటానికి సైతం పూనుకున్నారు.

నాన్న చనిపోయి ఎంతో కాలమైనప్పటికీ – ఇంత కాలందాకా అభిమానిస్తున్న ఈ పల్లె తల్లి ఋణం ఏమిచ్చి తీర్చుకోగలం ??...

(ఈనాడు ఆదివారం 23-9-2001)

కథా నిలయం
శ్రీకాకుళం